# థీమాటిక్

ఎం.సి. ఆంజనేయులు



భారత సైన్యంలో పనిచేసేందుకు ప్రతిభావంతులైన ఇంజనీర్ల ఎంపిక కోసం బెంగుళూరులో జరుగుతున్న పరీక్షలకు పాతిక మంది ఫైనలియర్ ఇంజనీరింగ్ విద్యార్థులు హాజరయ్యారు. అభ్యర్థులందరూ దక్షిణాదికి చెందినవాళ్లు.

ఆ రోజు సైనికాధికారులు నిర్వహిస్తున్న పరీక్ష పేరు ట్యాట్(TAT) అతి ముఖ్యమైన- థీమాటిక్ అప్రోచ్ టెస్ట్ అనే దాన్ని ఆ ఏడే మొట్టమొదటిసారిగా సాయుధ దళాల ఆఫీసర్ల ఎంపికలో ప్రవేశపెట్టారు.

ఆ గదిలోని తూర్పు గోడకు ఇరవై అడుగుల వెడల్పు, పది అడుగుల ఎత్తు కలిగిన ఓ పోస్టర్ వ్రేలాడుతోంది. పోస్టర్ కన్పించకుండా శాటిన్ కర్టెన్ ఆక్రమించింది.

గంట మ్రోగింది. శాటిన్ తెర తొలగింది.

'గుడ్ మార్నింగ్ ఎవ్రిబడీ!' అంటూ కంచు కంఠంతో ఓ సైనికాధికారి గదిలోనికి ప్రవేశించారు.

అభ్యర్థులందరూ అలర్ట్ అయిపోయారు.

'మైడియర్ యంగ్ ఫ్రెండ్స్! ఎదురుగా గోడ మీదున్న చిత్రాన్ని చూశారు కదా! ఎంత చక్కగా ఉందో! ఇటూ-అటూ దుర్గమమైన పర్వత సానువులూ, వెండి సర్పంలా మిలమిలలాడుతూ, కొండల మధ్య అణగి మణగి ప్రవహిస్తున్న సరయూ నదీ... అక్కడక్కడా కొండవాలుల్లోని మెట్ట ప్రదేశాలలో ఒకటో రెండో ఆదిమవాసుల ఆవాసాలు... అబ్బ!'

'ఆహ్లాదంగా ఉంది కదూ- ఆ పరిసర పర్యావరణమంతా?'

'ఈనాటి బడ్డింగ్ ఇంజనీర్లయిన మీరు- రేపు సాంకేతిక రంగంలో ఈ ప్రపంచాన్ని శాసించే మేధోజీవులు. మళ్లీ ఓమారు ఈ చిత్రాన్ని పరికించి చూడండి. చిత్రంలోని ఇతివృత్తాన్ని- మీ ఇష్టం- ఓ చక్కటి కవితలోనో, కథానికలోనో, వ్యాసంలోనో, వ్యాఖ్యలోనో అందంగా బంధించండి. మీ మనోభావాల వ్యక్తీకరణకు, కల్పనాశక్తికి, ఆలోచనా స్పష్టతకు, క్లుప్తతకు ఈ పరీక్ష ఓ గీటురాయి.'

'ఫ్రెండ్స్! మీ బల్లల మీద ఆన్సర్ షీట్స్ ఉన్నాయి. ఒక్కొక్క ఆన్సర్ షీట్‌లో పది పేజీలు ఉన్నాయి. అవసరమైన వారికి అదనపు షీట్లు కూడా అందజేయబడతాయి...'

అధికారి ప్రసంగం ఇంకా పూర్తి కానేలేదు. అప్పటికే చాలామంది అభ్యర్థులు తమ 'ప్రతిభ'ను ప్రదర్శిస్తూ పేజీల మీద తమ కలాలను పరుగెత్తిస్తున్నారు.

'యువర్ అటెన్షన్ ప్లీజ్! ఓ విషయం చెప్పడం మరిచాను. ఈ పరీక్షకు మీకు లభించే టైం- కేవలం 15 నిముషాలు. జస్ట్ ఫిఫ్టీన్ మినిట్స్ గుర్తుంచుకోండి. యువర్ టైం స్టార్ట్స్ నౌ!' గదిలోంచి నిష్క్రమిస్తూ, సైనికాధికారి అన్న ఆ మాటలకు అందరూ ఆశ్చర్యపోతూ, 'అంత తక్కువ టైమా' అన్నట్లు నోళ్లు వెళ్లబెట్టారు.

కలాల కదలిక తప్ప- గది నిశ్శబ్దంతో నిండిపోయింది. వంచిన తలలు ఎత్తకుండా రాసుకుపోతున్నారు. కొండలూ... కోనలూ... గుట్టలూ... మిట్టలూ- ఒరసి పారుతున్న సరయూ నది- పొగమంచు అలుముకున్న లోయ- ఆటవిక ఆదిమవాసులు- ఎన్నెన్ని ఇతివృత్తాలో కథా హారాలై, కవితా స్రవంతులై, వ్యాసాల వాహినులై రూపుదిద్దుకుంటున్నాయి- ఆన్సర్ పత్రాల మీద.

ఒకరిద్దరు అదనపు షీట్లు తీసుకున్నారు-

కొందరు వాచీలు చూసుకున్నారు-

అందరి ముఖాల్లోనూ ఓ అనిర్వచనీయమైన సృజనాత్మకత ఉట్టిపడుతోంది, ఒక్క అవినాష్ అనే అభ్యర్థి ముఖంలో తప్ప.

అవినాష్ ఆంధ్రరాష్ట్రంలోని అనంతపూర్ ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థి. సివిల్ ఇంజనీరింగ్ ప్రత్యేక పాఠ్యాంశంగా ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి.

తదేకంగా చిత్రాన్ని చూస్తూ ప్రశాంతంగా కూచున్నాడు అవినాష్. మూసి వుంచిన అతని కలం మూసినట్లే వుంది. కల్పనావ్యక్తత ఉద్దీపింపజేస్తూ ఒక్క వాక్యమైనా ఊడిపడడం లేదు. అతని కలంలోంచి వాక్యం మాట దేవుడెరుగు- ఒక్క పదం కూడా రాయలేకపోతున్నాడు.

'ఏదో రాయాలి... ఏదో... ఏదో...' అనుకుంటూ పేపరు మీద పెన్ను పెట్టాడు- అవినాష్.

అంతలో, టైం ముగిసినట్టు గంట మ్రోగింది.

సైన్యాధికారి అందరి ఆన్సర్ షీట్లు కలెక్ట్ చేస్తున్నాడు. చివరి నిముషం వరకు రాస్తూనే వున్నారు కొందరు.

తన వద్దకు రాబోతున్న అధికారిని చూసి, ఆన్సర్ షీట్ మొదటి పేజీలో పెద్ద పెద్ద అక్షరాలతో ఏవో నాలుగు మాటలు రాసి, మిగతా పేజీల్లో నిలువునా గీతలు గీసి, తన జవాబు పత్రాన్ని

సమర్పించాడు అధికారికి అవినాష్.

అవినాష్ కడపటి నిముషంలో రాసిచ్చిన ఆ క్లుప్తమైన వ్యాఖ్య చదివి, 'వ్వావ్!' అంటూ నవ్వుతూ ముందుకు కదిలాడు సైనికాధికారి.

మరుసటి రోజు 'ట్యాట్' పరీక్షా ఫలితాలు తెలిశాయి. ఆ పరీక్షలో ప్రథముడుగా అవినాష్ రావడం మిగతా అభ్యర్థులను ఆశ్చర్యచకితులను చేసింది.

ఏమి రాసి ఫస్ట్ ర్యాంక్ కొట్టేశాడో తెలుసుకుందామని అవినాష్ చుట్టూ చేరిపోయారు- మిగతా విద్యార్థులు.

'నిజం! నన్ను నమ్మండి! కొండలూ... కోనలూ... టట్... ఏముందా గోడమీది బొమ్మలో. ఏ అందాల అతివ చిత్రమో అయివుంటే- అరవై పేజీల వర్ణనతో ఓ చక్కటి వ్యాసం రాసి వుండేవాణ్ణి.'

'ఆలోచించి... ఆలోచించి... నా బుర్ర వేడెక్కిపోయింది. ఒట్టి పేపర్ ఇవ్వడం బావుండదని- కడపటి నిముషంలో తిక్కరేగి, 'బ్లాస్ట్ ద రాక్స్ అండ్ డామ్ ద రివర్' (BLAST THE ROCKS AND DAM(N) THE RIVER) అని ఓ పిచ్చి వ్యాఖ్య రాసి, ఆన్సర్ షీట్ సైన్యాధికారికిచ్చాను' నర్మగర్భంగా నవ్వుతూ అన్నాడు అవినాష్.

'అమ్మ! అనంతపురం అవినాషూ! ఏమో అనుకున్నాం... ఇంజనీరుకు, అందునా మిలిటరీ ఇంజనీరుకు కావలసిన బుద్ధికుశలత, సమయస్ఫూర్తీ, క్లుప్తత... మా అందరికన్నా నీకే అపారంగా ఉన్నాయి. 'కొండరాళ్లని బద్దలుకొట్టి- ఈ నదికి అడ్డంగా డ్యాం నిర్మిద్దాం!' అనే నీ వ్యాఖ్య చాలా సమంజసంగా ఉంది.'

'మేమే పిచ్చివాళ్లం... అధికారి మాటలు విని, పిచ్చిపిచ్చి వర్ణనలతో పేజీలకు పేజీలు నింపి, పప్పులో కాలేశాం!' అన్నారు ముక్త కంఠంతో మిగతా అభ్యర్థులు.

# లాస్ట్ ఛాన్స్

**- డి. శ్రీధరాచార్య.**

"నువ్వు మగాడివా?" స్వరంలో హేళన.

"ఏం నీ కనుమానమా?" అహంభావం.

"స్వశక్తితో బ్రతుకలేనివాడు, స్త్రీ తెచ్చే కట్నం డబ్బులను ఆశించేవాడు మగాడా?" అంది ధీర.

"కాకపోతే, నీకు బ్రతికినంత కాలం కూడు, గుడ్డ, నీడ నేనెందుకివ్వాలి?"

"నీలాంటి తుచ్ఛులను కంటున్నందుకు. నీలాంటి మగ జాతి అహంకారంతో ఏర్పరచుకున్న 'కట్టుబాట్ల'కు తలవంచి ఇవ్వాల్సిందే."

"నిన్నూ..." అతనిలో మృగత్వం జూలు విప్పుతోంది.

"ఏమీ చేయలేవు. నేను నీకు అణిగి వున్నంత కాలం అధికారం చలాయించావు. దౌర్జన్యం చేశావు. కళ్లు మూసుకుపోయి ప్రవర్తించావు. కానీ యిక నీ ఆటలు సాగవు. సాగనీయను."

"నీకు సంసారం చేసే లక్షణాలు లేవే...!" వ్యంగ్యం.

"నీలో చేయించుకునే లక్షణాలున్నాయా? ఇంతకాలం నేను కట్నంగా తెచ్చిన డబ్బును నీ ఇష్టం వచ్చినట్లుగా వాడుకున్నావు. ఇంకా ఎంతకాలం తెచ్చి ఇస్తాను?"

"పాలు వచ్చినంత కాలం పాదుగు పిండుకుంటారు. నీకు తెలియదా?"

"తెలిసే పొదుగును చేపు రాకుండా చేస్తున్నాను."

"ఆ పొదుగు చేపు రాకుంటే, కసాయివాడి కరుకు కత్తికి బలయిపోతుంది తెలుసా?"

"తన కొమ్ములకు వాడి వుందని- వాటి నుపయోగిస్తే ఏ కసాయివాడు తన దగ్గరకు చేరడని దానికి తెలుసు. అది నీవు గ్రహిస్తే మంచిది."

"ఇంతకూ... నీవు అనేదేమిటి?"

"నీకు తెలియదా! డబ్బు సంపాదించు. మగాడిననిపించుకో. నేను నీకు తోడుంటాను. కాదంటే... నా కొమ్ములు అలంకారానికి మాత్రమే కాదని, వాటి వాడి నుపయోగించవచ్చని తెలుసుకున్నాను. నా బ్రతుకు నేను బ్రతుకుతాను. కళ్లు తెరువు... లోకాన్ని చూడు... మంచి భర్తవని నిరూపించుకో... నీకు 'లాస్ట్ ఛాన్స్' ఇది..." అంది దృఢంగా ధీర.